COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


**ప్రచురణార్థం/ప్రసారార్థం :** **విజయవాడ,**

**తేది : 28.11.2019**

**సిపిఐ(ఎం) పార్టీ రాష్ట్ర విస్తృత సమావేశం ఈ రోజు విజయవాడలో ప్రారంభమైంది. సమావేశంలో ఆమోదించిన తీర్మానాన్ని ప్రచురణార్థం పంపుతున్నాము. – జె.ప్రభాకర్ –** ఆఫీసు కార్యదర్శి

**కేంద్ర ప్రభుత్వ విధానాలపై నెలరోజుల కాంపెయిన్–జనవరి 8 సమ్మెకు మద్దతు**

**సిపిఐ(యం) రాష్ట్ర విస్తృత సమావేశం పిలుపు**

మోడీ ప్రభుత్వ విధానాల వల్ల దేశవ్యాపితంగా ఆర్థికమాంధ్యం పట్టి పీడిస్తోంది. మన రాష్ట్రం మీదా దాని ప్రభావం తీవ్రంగా వుంది. వ్యాపారాలు పడిపోయాయి. ముఖ్యంగా సిమెంటు, స్టీలు, ఆటో మొబైల్ అమ్మకాలపై ప్రభావం ఎక్కువగా కనిపిస్తున్నది. విశాఖ స్టీలు 7 లక్షల టన్నులు స్టాకు పడింది. స్పిన్నింగ్ మిల్లులు వంటి కొన్ని రకాల పరిశ్రమల్లో కార్మికుల సంఖ్య తగ్గించడం, లేదా షిఫ్టులు తగ్గించడం, పనిదినాలు తగ్గించడం వంటి చర్యలు తీసుకుంటున్నారు. నిరుద్యోగం పెరగడంతో వేతనాల పెంపుపై ప్రతికూల ప్రభావం కనిపిస్తున్నది. రియల్ ఎస్టేట్ మందగించింది. రాష్ట్రంలో ఇసుక సమస్యకు మాంద్యం తోడవడంతో నిర్మాణ పనులు తగ్గిపోయాయి. భవననిర్మాణ కార్మికులు వీధిన పడ్డారు. వ్యవసాయ ఖర్చులు పెరిగి, గిట్టుబాటు ధరలు రాక రైతులు దివాళా ఎత్తి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పాలపొడి దిగుమతితో పాల ధర పెరక్క పాడి రైతులు నష్టపోతున్నారు. వ్యవసాయ రంగ ప్రయోజనాలను ఫణంగా పెట్టి ప్రాంతీయ ఆర్థిక స్వేఛ్ఛా ఒప్పందం చేసుకోడానికి మోడీ ప్రభుత్వం సిద్ధపడింది. ప్రజలు, రైతాంగం, మేధావులు ప్రతిఘటనతో వెనక్కి తగ్గింది. మొత్తంమీద ప్రజల ఆదాయాలు తగ్గి కొనుగోలు శక్తి పడిపోయిన ప్రభావం వివిధ రంగాలపై కనిపిస్తున్నది. ప్రజా జీవనాన్ని సంక్షోభంలో పడేసిన మోడీ ప్రభుత్వ ఆర్థిక విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని సిపిఐ(యం) రాష్ట్ర విస్తృత సమావేశం రాష్ట్ర ప్రజానీకానికి పిలుపునిస్తోంది.

బిజేపీ కేంద్రంలో రెండో సారి అధికారం చేపట్టాక రాష్ట్రం పట్ల వివక్ష మరింత పెరిగింది. ఎన్నికలకు ముందు ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిన బిజేపీ ప్రభుత్వం ఇప్పుడు మరింత నగ్నంగా రాష్ట్రానికి అన్యాయం చేస్తోంది. పోలవరం, రాజధాని, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజి, కేంద్ర విద్యాసంస్థల నిర్మాణాలకు నిధులు ఇవ్వడం లేదు. కడప ఉక్కు ఫ్యాక్టరీ, రామాయపట్నం పోర్టు గురించి ఊసే లేదు. రాష్ట్రానికి గర్వకారణంగా ఉన్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేయడానికి పూనుకుంటున్నది. వెనుకబడిన ప్రాంతాలకివ్వాల్సిన రు. 3500 కోట్ల నిధులను ఎగనామం పెట్టింది. విభజన చట్టంలో పేర్కొన్నట్లు రెవెన్యూలోటు పూడ్చుకోడానికి ఎలాంటి సహాయమూ అందించలేదు. రాజధాని, పోలవరం ప్రాజెక్టులకివ్వాల్సిన నిధులనూ ఇవ్వలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలసి సహాయం అడగటానికి ఢిల్లీ వెళితే ఉద్దేశపూర్వకంగా ముఖ్యమంత్రికి ఇంటర్వ్యూ ఇవ్వకుండా జాప్యం చేయడం రాష్ట్రాన్ని అవమానించడమే. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో యురేనియం తవ్వకాలు చేపట్టి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోంది.

నూతన విద్యావిధానం పేరుతో కేంద్రం కార్పొరేట్ విద్యకు పెద్దపీట వేస్తోంది. హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వ ఆస్తులు అమ్మి ప్రైవేటుకు కట్టబెడుతోంది. బిఎస్ఎన్ఎల్, ఎయిర్ ఇండియా, రైల్వేస్, రక్షణ, ఉక్కు, ఆయిల్ తదితర ప్రతిష్టాత్మక ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేయడానికి రంగం సిద్ధం చేసింది. అంబానీ, అదానీ వంటి తన అనుంగు కంపెనీలకు సహజవనరులపై పెత్తనం ఇచ్చింది.

మహారాష్ట్రలో అర్ధరాత్రి ప్రజాస్వామ్యాన్ని హతమార్చడానికి కుట్ర పన్నింది. ఉన్నత న్యాయస్థానం, ప్రజల అప్రమతతతో

దాన్ని నిరోధించగలిగారు. విధి లేని పరిస్థితులలో బిజేపీ ముఖ్యమంత్రి రాజీనామా చేసి తప్పుకోవాల్సి వచ్చింది. ఇలా బిజేపీ ప్రజాస్వామ్యాన్నే అపహాస్యం చేస్తోంది.

జాతీయ పౌరసత్వ రిజస్టరు పేరుతో దేశ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. ముఖ్యంగా మైనారిటీలలో అభద్రతా భావం నెలకొంది. అసోంలో అన్ని తరగతుల, మతాల ప్రజలు దీనికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నారు. దీన్ని అమలు చేయకుండా ప్రతిఘటించాలని ప్రజలకు సిపిఐ(యం) విజ్ఞప్తి చేస్తోంది.

కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు కోడ్‌లు తీసుకురావడానికి నడుంకట్టింది. ఇప్పటికే 17 చట్టాలు రద్దయ్యాయి. వాటి స్థానంలో వచ్చిన రెండు కోడ్‌లు కార్మిక హక్కుల్ని హరించాయి. బడాకార్పోరేట్ యాజమాన్యాలు ఇష్టానుసారం కార్మికుల్ని దోచుకోడానికి ఈ కోడ్‌లు ఉపయోగపడతాయి.

మోడీ ప్రభుత్వ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి ఒక పథకం ప్రకారం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతోంది. మన రాష్ట్రంలో సైతం చాపకింద నీరులాగా పసి మనస్సుల్లో విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయంగా బలపడాలని చూస్తోంది. ఏజెన్సీతో సహా అనేక ప్రాంతాల్లో పండుగలు, గుడులను ఆసరా చేసుకొని సమీకరణలు చేస్తోంది. పరమత ద్వేషాన్ని రెచ్చగొడుతోంది. కులాలు, ఉపకులాల మధ్య అగ్గిరాజేస్తున్నది. ఆఖరికి తెలుగు భాషా మాధ్యమం సమస్యకు కూడా మతం రంగు పులిమింది. తిరుపతి టిటిడిలో పని చేసుకొని పొట్టపోసుకుంటున్న వారిని అన్య మతస్తులంటూ భయభ్రాంతులకు గురి చేస్తోంది. వారి ఉపాధిని దెబ్బకొట్టేందుకు కుట్ర చేస్తోంది. ప్రజల భక్తిభావాలతో రాజకీయ వ్యాపారం చేస్తోంది. రాష్ట్ర ప్రజలు అప్రమత్తతో వీరి పన్నాగాలను ఎదుర్కొని, ఐక్యతను కాపాడాలని సిపిఐ(యం) రాష్ట్ర విస్తృత సమావేశం విజ్ఞప్తి చేస్తున్నది.

దేశ వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న బిజేపీ పట్ల మన రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష ప్రాంతీయ పార్టీలు మెతకవైఖరి అవలంబించడం ఆందోళన కలిగించే అంశం.మన రాష్ట్రం పట్ల కేంద్రం అనుసరిస్తున్న వివక్షాపూరిత విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం కూడా గొంతెత్తడం లేదు. రాజధాని, పోలవరం ప్రాజెక్టులకు నిధులు, రెవెన్యూలోటును పూడ్చడం, కేంద్ర విద్యాసంస్థలకు , వెనుకబడిన ప్రాంతాలకు నిధులివ్వకపోవడాన్ని పార్లమెంటులో ప్రశ్నించడం లేదు. వైయస్సార్ కాంగ్రెసు, తెలుగుదేశం ఎంపీలు రాష్ట్రం పట్ల కేంద్రం అనుసరిస్తున్న వివక్షతపైనా, దాని ఆర్థిక విధానాలపైనా నిలదీసి, ప్రత్యేక హోదా, రాష్ట్ర విభజన హామీలను సాధించాలని కోరుతున్నాం. ఇందుకు అవసరమైతే అఖిలపక్ష సమావేశం జరిపి అన్ని పక్షాలతో కలసి కేంద్రం వద్దకు రాయబారం నడపాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రంలో వామపక్ష పార్టీలు డిశంబర్ 10 నుండి 25 వరకు దీక్షలు, ధర్నాలు చేయాలని ఇచ్చిన పిలుపును జయప్రదం చేయాలని కోర్తున్నాం.

కేంద్ర ప్రభుత్వ దుష్ట విధానాలకు వ్యతిరేకంగా డిశంబర్ 10 నుండి జనవరి 8 వరకు మాసం రోజుల పాటు రాష్ట్రమంతా విస్తృతంగా ప్రచార కాంపెయిన్ నిర్వహించాలని అన్ని శాఖలను కోరుతున్నది. జనవరి 8న జరగనున్న దేశవ్యాపిత కార్మిక, ఉద్యోగుల సాధారణ సమ్మెకు మద్దతుగా డిశంబర్ మూడో వారంలో విశాఖలో వామపక్షాలు తలపెట్టిన రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిపిఐ(యం) విజ్ఞప్తి చేస్తున్నది.

= = = =